


**మూడు నెలలుగా వనజ వెంటబడి తిరుగుతున్నాడు సుబ్బారావ్. ఆమె సినిమాకు పోతే తనూ సినిమాకు పోయేవాడు.**

# షరతులు



ఆమెకూ, ఆమె స్నేహితు లందరికీ టిక్కెట్లు తీసేవాడు. హోటల్లో కనబడితే గొప్పకుపోయి అందరిబిల్లూచెల్లించేవాడు. సిటీబస్సులో తను కూర్చొని, వనజ నిలబడితే, తనులేచి ఆమెకు సీటిచ్చేవాడు. ఇలా ఆమె మెప్పు పొందడంకోసం, ఆమెకు దగ్గర కావడంకోసం సుబ్బారావు చేసే త్యాగాలూ, పెట్టే ఖర్చులూ యెన్నో.... ఎన్నెన్నో.

ఒక్కసారి పార్కులో కలిసి కొంచెం సేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్న తరువాత "వనజగారూ! నేను మిమ్మల్నొకటడగాలనుకుంటున్నాను." అన్నాడు సుబ్బారావ్.

"అడగండి" అన్నది ఓ కుర్రాడు యింకో కుర్రదాన్ని యేకాంతంలో అడిగేదేమిటో తెలిసిన వనజ.

"మీ కిష్టమైతే మిమ్మల్ని పెళ్ళిజేసుకుంటాను" అనేసి, తన హృదయాన్ని ఆమె ముందు తెరచి పరచినంత సంబరపడిపోతూ, జేబులోనుంచి సిగరెట్ తీసి వెలిగించాడు విజయ గర్వంతో.

"కొంతవరకు నయం. ఇంతకు ముందడిగిన వాళ్ళలా ప్రేమిస్తున్నాననకుండా పెళ్ళి జేసుకుంటా నంటున్నాడు. ఫరవాలేదు." అనుకుంది వనజ.

వనజకు పైకి కనిపించే సుబ్బారావు మాత్రం తెలుసు.

**అయినాల కనకరత్నాచారి**

అతని వుద్యోగం తెలుసు.

జీతం తెలుసు.

మనిషి కొంచెం ఆకర్షణీయంగానే వుంటాడుగాబట్టి, వెంటబడి యింతవరకూ తనకైతనే యెంతో ఖర్చుచేసి దూల వదిలించుకున్నాడు కాబట్టి, మీదు మిక్కిలి యీ రోజుల్లో ఆడపిల్లలకు మొగుళ్ళు దొరకడం కొంచెం కష్టంగా వుందికాబట్టి చేసుకుంటే ఫరవాలేదనిపించింది. కాని— అతనిలోని సుబ్బారావుగాని, అతడి అలవాట్లు గానీ తెలియవు ఆమెకు. ఏదీ తెలియకుండా చేసుకుంటే తరువాత జీవితం యెలా వుంటుందో?.... అతడి సంగతి తెలియాలంటే అతడి మిత్రులెవరైనా తెలియాలి. పరాయివాళ్ళు, ప్రక్కవాళ్ళు పది అబద్ధాలతో నైనా పెళ్ళి కుదర్చాలనే మతం ప్రదర్శిస్తారేమో! తనేస్వయంగా తెలుసుకోవాలంటే అతడ్ని యెన్నాళ్ళు ఫాలో కావాలి? లేదా యింకేదైనా ప్రత్యామ్నాయం వెదకాలి. ఇప్పుడు సమాధానం చెప్పటమెలా? అనుకుంటున్నమీదట మెరుపులా ఓ ఆలోచన తట్టింది వనజకు.

"చేసుకోవచ్చుగాని నాకు కొన్ని షరతులున్నాయి. అవి మీ రొప్పుకుంటే తప్పకుండా చేసుకుంటాను" అన్నది వనజ.

"ఆలస్యం దేనికి ఏమిటో చెప్పు? పెళ్ళయ్యాక నీ జీతం మీ వాళ్ళకే యివ్వాలా?" ఆదుర్దాగా అడిగాడు సుబ్బారావ్.

"అదేంకాదు. అంతకన్నా వెరీ సింపుల్. మన పెళ్ళయ్యాక మీరు సిగరెట్లు మానెయ్యాలి."

"ఓస్. యింతేనా. నీకిష్టం లేకపోతే తప్పకుండా మానేస్తాను." అంటూ చేతిలోవున్న సిగరెట్ విసిరి కొట్టాడు.

"సినిమా లెక్కువగా చూడకూడదు."

"ఓయస్ అలాగే."

"ఈవెనింగ్స్ క్లబ్బులో పేకాట్టం మానెయ్యాలి."

"తప్పకుండా మానేస్తాను."

"పార్టీలూ గట్రా అంటూ అప్పుడప్పుడైనా తాగడం మానెయ్యాలి."

"ఓ ముమ్మాటికి. నీమీదొట్టు. ఇంకెప్పుడూ దాని జోలికి పోను. కంప్లీట్‌గా మానేస్తాను."

"చెడు తిరుగుళ్ళేవైనా వుంటే ఫుల్‌స్టాప్ పెట్టెయ్యాలి."

"తప్పేదేముంది? దేవిగారి ఆజ్ఞ. సత్యభామ గీచినగీటుదాటని శ్రీకృష్ణునిలా వనజ గీచిన గీటు దాటడీ సుబ్బారావ్. సరేనా. ఇంకేమైనా మానెయ్యవలసినవుంటే చెప్పు మానేస్తాను." అన్నాడు సుబ్బారావ్ పెద్ద హీరోలా కాలర్ సవరించుకొని. అన్నీ మానేస్తున్నాను గాబట్టి తప్పకుండా వనజ పెళ్ళికి ఒప్పుకుంటుందన్న ధీమా కలిగింది సుబ్బారావుకు.

అతడిదగ్గర మానెయ్యవలసిన అలవాట్లన్నీ వున్నాయని తెలుసుకొన్న వనజ "చివరగా యింకొక్కటుంది నువ్వు మానెయ్యవలసింది" అన్నది.

"త్వరగా చెప్పు అది కూడా మానేస్తాను." అన్నాడు సుబ్బారావ్— యిన్ని మానేసినవాడికి యింకొకటి యెక్కువౌతుందా అన్నట్లు.

"అయితే యికనుంచి నన్ను పెళ్ళిజేసుకోవాలన్న ఆలోచన మానెయ్యండి" అనిచెప్పి చకచకా వెళ్ళిపోయింది వనజ.

హతాశుడై నోట మాటరాక నిలబడ్డాడు వెర్రిబాగుల సుబ్బారావ్. ●

